సాక్షి మంచిర్యాల

బుధవారం, 30, ఆగస్టు, 2023



అను'బంధాల' రాఖీ

రాఖీ పండుగ సోదరి, సోదరుడి మధ్యన అనుబంధానికి ప్రతీక. బుధవారం ఉదయం 10:58 గంటలకు ప్రారంభమై మరుసటి రోజు ఉదయం 7:05కు ముగుస్తుంది.

8లో▸

TSRTC Gamyam Track-Ride-Arrive

గమ్యం.. ప్రయాణం సులభతరం

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆర్టీసీ గమ్యం యాప్ అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌తో మహిళలకు రక్షణ లభిస్తుంది.

10లో▸

గరిష్టం/కనిష్టం 33.6 /24.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చినుకులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నెన్నెల పీడీకి గోల్డ్‌మెడల్



గోపాల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్

నెన్నెల: ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ రాష్ట్రస్థాయి పోటీల్లో లాంగ్‌జంప్ విభాగంలో నెన్నెల జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పీడీ సిరంగి గోపాల్ గోల్డ్‌మెడల్ సాధించారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా మంచిర్యాల బాయ్స్ హైస్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ సంతోష్ సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

సైన్స్ కాంగ్రెస్‌కు విద్యార్థులను సిద్ధం చేయాలి

మంచిర్యాలఅర్బన్: సెప్టెంబర్ 3వ వారంలో నిర్వహించే జిల్లాస్థాయి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలకు విద్యార్థులను సిద్ధం చేయాల ని డీఈవో యాదయ్య సూచించారు. జిల్లాలో సైన్స్ ఉపాధ్యాయులకు జూమ్ ద్వారా మంగళవారం అవగాహన కల్పించారు. ఆరోగ్యం, సంక్షేమం కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం, విద్యార్థులకు అవగాహన కోసం ఐదు ఉప అంశాలుగా విభజించినట్లు వివరించారు. మీ పర్యావరణ వ్యవస్థ గురించి తెలుసుకో, ఆరోగ్యం పోషణ, సంక్షేమం పెంపొందించటం, పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సామాజిక , సాంస్కృతిక పద్ధతులు, స్వీయ విశ్వాసం కోసం పర్యావరణ వ్యవస్థ ఆధారిత విధానం ఆరోగ్యం కోసం సాంకేతిక ఆవిష్కరణలపై పోటీలు ఉంటాయని వెల్లడించారు. వివరాలకు డీఎస్‌వో మధుబాబును సంప్రదించాలని తెలిపారు.

స్కూల్ స్వీపర్ల భిక్షాటన

పాతమంచిర్యాల: సమస్యలు పరిష్కరించాలని స్కూల్ స్వీపర్లు మంగళవారం భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని 34 రోజులుగా జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయం ఎదుట సమ్మె, దీక్ష చేస్తున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో భిక్షాటన చేశారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తున్న ప్రభుత్వం 30 ఏళ్లుగా పనిచేస్తున్న తమను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. నిరసనలో స్వీపర్లు నారాయణ, కరీమా, లింగయ్య, గట్టయ్య, పద్మ, హైదర్, రాజేశ్వరి పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ స్థలం రీ సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

నస్పూర్: పట్టణ పరిధిలోని టీఎన్జీవోస్ సొసైటీ స్థలం రీసర్వేను అధికారులు మంగళవారం చేపట్టారు. 2000 సంవత్సరంలో నస్పూర్ శివారులోని 42 సర్వే నంబరులో 32 ఎకరాల స్థలాన్ని అప్పటి ప్రభుత్వం టీఎన్జీవోస్ సొసైటీకి కేటాయించింది. అప్పటి నుంచి ఆ భూమి చుట్టూ పలు వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. కొంత వరకు స్థలంలో వారికి కేటాయించిన ప్లాట్లలో టీఎన్జీవోలు ఇళ్లు నిర్మించుకున్నారు. చాలా వరకు ఖాళీగా ఉంది. టీఎన్జీవోస్ సొసైటీకి కేటాయించిన స్థలం ఆక్రమణకు గురైందని దానిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ సంతోష్, టీఎన్జీవోస్ సొసైటీ స్థలాన్ని రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో రీసర్వే చేపట్టి సెప్టెంబర్ 8 వరకు నివేదిక అందించాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు మంగళవారం రీసర్వేను ప్రారంభించారు. ఏడీ(సర్వే అండ్ లాండ్ రికార్డ్స్) శ్రీనివాస్, డీఈ గంగాధర్, నస్పూర్ డీటీ శ్రావణి, ఆర్ఐ మాంతయ్య, సర్వేయర్ కృష్ణప్రియ, సర్వేయర్లు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మానవహారం, ర్యాలీ నిర్వహించారు. డీఈవో కార్యాలయం నుంచి పట్టణ పుర వీధుల మీదుగా ఐబీ చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. మానవహారం అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా కనీస వేతన స్కేలు అమలు చేయాలని, ప్రతీ ఉద్యోగికి జీవితబీమా రూ.10 లక్షలు ఆరోగ్యబీమా రూ.5 లక్షల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు భారతి, నగేష్, మూర్తి, రాకేష్, శ్రీకర్, రాంబాబు పాల్గొన్నారు.

కొలువు కల చెదిరింది!

- సింగరేణి జూనియర్ అసిస్టెంట్ పరీక్ష రద్దు
- లోపాలతో నిర్వహించారన్న హైకోర్టు
- మెరిట్ జాబితాలోని అభ్యర్థుల్లో ఆందోళన
- ఏడాదిగా ఎదురుచూసినా నిరాశే



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సింగరేణి జూనియర్ అసిస్టెంట్(గ్రేడ్2) ఎక్స్‌టర్నల్ పోస్టులకు ఎంపికైన నిరుద్యోగుల కొలువు కల చెదిరింది. ఆ పరీక్షను రద్దు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇవ్వడంతో అభ్యర్థులు తీవ్ర నిరాశలో ఉన్నారు. సంస్థలో 177 పోస్టుల కోసం 90,928 మంది పరీక్ష రాశారు. ఆ మేరకు అభ్యర్థుల ప్రొవిజనల్ సెలెక్షన్ లిస్టును కూడా యాజమాన్యం విడుదల చేసింది. నియామక ఉత్తర్వులు అందాల్సి ఉంది. ఈ క్రమంలో ఓ అభ్యర్థి సింగరేణి నిర్వహించిన ఈ పరీక్షలో లోపాలు ఉన్నాయంటూ హైకోర్టును ఆశ్రయించాడు. విచారణ జరిపి, ఈనెల 28న పరీక్ష రద్దు చేయాలంటూ హైకోర్టు తుది తీర్పు వెలువరించింది. దీంతో ఎంతో శ్రమించి చదివి పరీక్ష రాసి, అర్హత సాధించిన వారంతా ఆందోళన చెందుతున్నారు. మళ్లీ పరీక్ష నిర్వహిస్తారా? లేక తీర్పుపై అప్పీల్‌కు వెళ్తారా? అనేదానిపై స్పష్టత లేదు.

సింగరేణి కొలువుకు డిమాండ్

సింగరేణిలో కొలువు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల కంటే జీత, భత్యాలు, సౌకర్యాలు మెరుగ్గా ఉంటాయి. ఇప్పుడున్న వేతన సవరణతో ఎగ్జిక్యూటివ్ స్థాయిలో కనీసం రూ.40 వేలపైనే జీతం ఉంటుంది. కంపెనీ క్వార్టరు, ఉచిత విద్యుత్, గ్యాస్, వైద్యారోగ్య సదుపాయాలు, బీమా, వారసత్వ ఉద్యోగ కల్పన, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఉన్నాయి. దీంతో ఈ ఉద్యోగాలకు తీవ్ర పోటీ ఉంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత సింగరేణి ప్రభావిత ప్రాంతాలైన ఉమ్మడి నాలుగు జిల్లాల స్థానికులకే 60 శాతం, ఓపెన్ కేటగిరీలో 40 శాతం పోస్టులు భర్తీ చేస్తున్నారు. అయితే సంస్థలో కొలువు దక్కించుకునేందుకు కొందరు అడ్డదారులు వెతికి అర్హులకు అన్యాయం చేస్తున్నారు. గతంలో కొత్తగూడెంలో జరిగిన ఓ ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ కావడంతో రద్దు చేశారు. అంతకుముందు జరిగిన జూనియర్ అసిస్టెంట్ ప్రశ్నాపత్రం లీకైందని, ఒకే ఇంటి నుంచి ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఫిర్యాదులు వెళ్లాయి. అయితే సంస్థ పకడ్బందీగా నియామకాలు చెబుతున్నా నిరుద్యోగులకు ఉద్యోగంలో చేరే వరకు నమ్మకం లేకుండాపోతోంది.

పరీక్షపై ఆది నుంచి ఆరోపణలే...

జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ ప్రకటన వెలువడినప్పటి నుంచే పైరవీలు, దళారులతో ప్రశ్నపత్రాల లీకేజీ అంటూ ప్రచారం జరిగింది. దీనిపై స్పందించిన సంస్థ ఎక్కడైనా అక్రమాలు జరిగితే సమాచారం ఇవ్వాలని టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేసింది. పారదర్శకంగా నిర్వహిస్తున్నామని పలుమార్లు ప్రకటించింది. అయితే పరీక్ష రాశాక, ప్రశ్నపత్రం అభ్యర్థులకు ఇవ్వకపోవడంపై అభ్యంతరం చెబుతూ కోర్టు వెళ్లడంతో తిరిగి ఇచ్చేలా ఉత్తర్వులు వచ్చాయి. అయితే హాల్‌టికెట్లలో 'తెలంగాణ' 'ఆంధ్రప్రదేశ్' 'బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్' 'డిగ్రీ' వంటి పేర్లతో అభ్యర్థులు పరీక్ష రాయడంతో అభ్యంతరాలు వెల్లువత్తాయి. దీనిపైనే కేసు వేయగా, పరీక్ష పూర్తయి, మెరిట్ జాబితా వెలువడ్డాక తీర్పు రావడంతో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

లక్షకుపైగా దరఖాస్తులు..

సింగరేణి యాజమాన్యం 177 జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు ప్రకటన ఇస్తే, ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి 1.02 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 98,882 మందికి హాల్ టికెట్లు జారీ అయ్యాయి. ఇందులో 90,928 మంది పరీక్షకు హాజరయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే 11 వేల మంది పరీక్ష రాశారు. పరీక్ష నిర్వహించిన మరుసటి రోజే సింగరేణి 'కీ' విడుదల చేసింది. నెల రోజుల్లోనే మెరిట్ జాబితా విడుదలైంది. కేసు కారణంగా తుది ఎంపిక నిలిచిపోయింది.

తీవ్ర నిరాశకు లోనయ్యా.

ఉద్యోగానికి ఎంపికైనట్లు మెరిట్ జాబితాలో రాష్ట్ర స్థాయిలోనే మొదటి ర్యాంక్ రావడంతో ఆనందం కలిగింది. మా కుటుంబ సభ్యులతోపాటు అందరూ ఉద్యోగం వచ్చిందని అనుకున్నారు. కానీ పరీక్షనే రద్దుచేస్తూ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులతో తీవ్ర నిరాశకు లోనయ్యా.

– కాసం శివప్రసాద్, మొదటి ర్యాంకర్, తిర్యాణి, ఆసిఫాబాద్ జిల్లా

పోలింగ్ కేంద్రాలపై అవగాహన ఉండాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్: సెక్టార్ అధికారులు తన పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ప్రతీ అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్ సూచించారు. ఐడీవోసీలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు సబావత్ మోతీలాల్, బి.రాహుల్, మంచిర్యాల ఆర్డీవో రాములుతో కలిసి సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన విధులు బాధ్యతగా నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఓటర్లకు ఈవీఎం ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో 287 పోలింగ్ కేంద్రాలకుగాను 88 మంది సెక్టార్ అధికారులను నియమించామన్నారు. ఓటరు నమోదు, అడ్రస్ మార్పులు చేర్పులపై సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. సెప్టెంబర్ 28న ఫిర్యాదులు అభ్యంతరాలు పరిష్కరించి అక్టోబర్ 4న తుది ఎన్నికల జాబితా విడుదల చేస్తామన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలని తెలిపారు.

రద్దీకి అనుగుణంగా బస్సులు

మంచిర్యాలఅర్బన్: రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ఆయా రూట్లలో రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపిస్తున్నట్లు మంచిర్యాల ఆర్టీసీ డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాలకు వచ్చే ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఏడు బస్సులు అదనంగా నడుపుతున్నట్లు పేర్కొన్నారు.

పది స్థానాలు.. 94 మంది దరఖాస్తు

- కాంగ్రెస్ టికెట్లకు పోటీ తీవ్రం



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి పది అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 94 మంది అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఖానాపూర్ కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్యే రేఖానాయక్ చేసుకోగా, ఆమె భర్త రిటైర్డ్ రవాణా శాఖ అధికారి శ్యామ్ నాయక్ ఆసిఫాబాద్‌కు దరఖాస్తు చేశారు. బెల్లంపల్లికి మాజీ మంత్రి వినోద్, మంచిర్యాలకు మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు వంటి సీనియర్ నాయకులు ఉన్నారు. గతంలో పోటీ చేసిన వారితోపాటు కొత్తవారు, పార్టీలో చేరనివారు సైతం టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా బోథ్ నుంచి 18 మంది, అత్యల్పంగా సిర్పూర్, ముథోల్ నుంచి నలుగురు దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి ముగ్గురు చొప్పున ఎంపిక చేసి తుది పేర్లను ఏఐసీసీ స్థాయిలో పరిశీలనలు చేసి ప్రకటించే అవకాశం ఉందని పార్టీ నాయకులు తెలిపారు.

నియోజకవర్గం	దరఖాస్తులు
బోథ్	18
ఖానాపూర్	15
చెన్నూరు	13
ఆసిఫాబాద్	10
బెల్లంపల్లి	10
ఆదిలాబాద్	08
మంచిర్యాల	07
నిర్మల్	05
ముథోల్	04
సిర్పూర్	04

క్రీడలు జీవితంలో భాగం కావాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్
- ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



ఉత్తమ క్రీడాకారులు, కోచ్‌లతో కలెక్టర్ సంతోష్



సాంస్కృతిక ప్రదర్శనల్లో విద్యార్థులు

మంచిర్యాలటౌన్: క్రీడలు, వ్యాయామం ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం చలో మైదాన్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ హాజరై ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో క్రీడలకు కొంత సమయం కేటాయించాలన్నారు. దేశంలో అనేక మంది క్రీడాకారులు తమ జీవితంలో ఎంతో కష్టపడి క్రీడారంగంలో రాణించి, విశేష సేవలు అందించి అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ఖ్యాతి సంపాదించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి అనేక కార్యక్రమాలను చేపడుతుందన్నారు. క్రీడల్లో రాణించడం వల్ల ఉన్నత విద్య, ఉద్యోగాలలో అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఫాం6 ద్వారా వారి వివరాలు నమోదు చేసుకుని ఓటు హక్కు పొందాలని సూచించారు. జిల్లా యువజన క్రీడా సర్వీసుల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి, స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు



సమీక్షలో మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అన్ని ప్రభుత్వ వైద్యాధికారులు, సూపర్‌వైజర్లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతీ పీహెచ్‌సీలో రికార్డులను సక్రమంగా నిర్వర్తిస్తూ, సమయపాలన పాటించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి తిరిగి రోగులను గుర్తించి, వైద్య సేవలను అందించాలని తెలిపారు. వ్యాక్సినేషన్, ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళ శిబిరాలకు మహిళలు వచ్చేలా చూడాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాని సూచించారు. జాతీయ క్వాలిటీ బోర్డు ద్వారా జైపూర్ పీహెచ్‌సీ, తాండూర్ పీహెచ్‌సీలు సర్టిఫికెట్లు పొందడాన్ని అభినందించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నీరజ, డాక్టర్ అనిత, డీఎస్‌వో డాక్టర్ ఫయాజ్‌ఖాన్, డీపీవో ప్రశాంతి, డెమో బి.వెంకటేశ్వర్, డీడీఎం ప్రవళిక పాల్గొన్నారు.

మంచిర్యాలలో రాజకీయ, సామాజిక అణచివేత

- బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు
- జిల్లా కేంద్రం నుంచి దండేపల్లి వరకు బైక్‌ర్యాలీ



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

పాతమంచిర్యాల: మంచిర్యాల ప్రాంతంలో విస్తారమైన ఖనిజసంపద, అడవులు, గోదావరి నది, వేల ఎకరాల వ్యవసాయ భూములున్నా 76 ఏళ్లుగా రాజకీయ, సామాజిక, ఆర్థిక అణచివేతకు గురవుతోందని బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు మంచిర్యాల ఎమ్మెల్యే టికెట్‌ను బీసీ సామాజిక వర్గానికే కేటాయించాలని మంగళవారం జిల్లా కేంద్రం నుంచి దండేపల్లి మండలం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బీసీ ఐక్యవేదిక నాయకుడు డాక్టర్ బొడ్డు రఘునందన్, డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు, గాజుల ముఖేష్‌గౌడ్, నీలిశ్రీనివాస్ డాక్టర్ రమణ, ముత్తే సత్తయ్య మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైతే మంచిర్యాల ఎంతో అభివృద్ధి చెందుతుందని భావించి ఇక్కడి ప్రజానీకం ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. కానీ ఎలాంటి మార్పు లేదన్నారు. రైతుల కోసం నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటివాటా 35 టీఎంసీల నీరు మన ప్రాంత రైతులకు దక్కకుండా పోయిందని, మన నీరు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నా స్థానిక రాజకీయ నాయకులు చేష్టలుడిగి చూస్తున్నారని విమర్శించారు. నీటి వాటా కోసం మన పోరాడాలని పిలుపునిచ్చారు. రైతులు పండించిన పంట నిల్వ చేసుకోవడానికి కోల్డ్‌స్టోరేజీ ప్లాంట్‌లు నిర్మించాలని, మాతాశిశు ఆస్పత్రిని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ స్థలంలో నిర్మించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమై పోతున్నాయని, కేజీటూ పీజీ విద్య కోసం పోరాటాలు చేయాల్సిన అవసరముందన్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ రోజు రోజుకూ నష్టాల్లో కూరుకుపోతోందన్నారు. అండర్ గ్రౌండ్ బావులు మూసి ఓపెన్‌కాస్టులు ఏర్పాటు చేస్తున్నారని దీంతో కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. బీసీలు రాజ్యాధికారం చేపడితేనే ఈ ప్రాంత సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. బీసీ జనగణను కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని బీసీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. చట్ట సభల్లో ఓబీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో పురిటి కష్టాలు!

- ఎంసీహెచ్‌ను జీజీహెచ్‌కు తరలింపుతో సమస్యలు
- పెరుగుతున్న ప్రసవాలతో సరిపోని పడకలు
- కిక్కిరిసిపోతున్న వార్డులు, వరండాల్లోనూ బెడ్లు..
- పట్టించుకోని అధికారులు



మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని వార్డులో బాలింతలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)కు అనుబంధంగా ఏర్పాటు చేసిన మాతా శిశు ఆరోగ్యకేంద్రం(ఎంసీహెచ్)ను గోదావరి ఒడ్డున నిర్మించగా, ఇటీవల వరద నీరు చేరింది. దీంతో గర్భిణులు, బాలింతలను జీజీహెచ్‌కు తరలించారు. ఇక్కడే సాధారణ, సిజేరియన్ ప్రసవాలు చేస్తున్నారు. చికిత్స అందిస్తున్నారు. ఎంసీహెచ్‌లో ఉండాల్సిన సౌకర్యాలు జీజీహెచ్‌లో లేకపోవడంతో, ఆసుపత్రికి వచ్చే గర్భిణులు అష్టకష్టాలు పడుతున్నారు. సరిపడా వార్డులు, బెడ్లు లేకపోవడంతో ప్రసవం తరువాత బాలింతలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. సరైన వసతులు లేక ఆపరేషన్ జరిగిన బాలింతలు ఇన్‌ఫెక్షన్ బారిన పడుతున్నారు. ఆపరేషన్లు జరిగిన వారే కాకుండా సాధారణ ప్రసవాలు జరిగిన వారికి కూడా బ్లీడింగ్ జరగకుండా వేస్తున్న కాటన్ ప్యాడ్‌లను తొలగించడంలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఎంసీహెచ్‌లో వైద్యసేవలను అందించినప్పుడు రాని సమస్యలు, జీజీహెచ్‌కు తరలించిన తర్వాతే ఎందుకు వస్తున్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ప్రసవాలు పెరుగుతున్నా.. పట్టింపేది?

మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్యం అందడంతో, పేద, మధ్యతరగతి ప్రజలు ప్రసవం కోసం ఎంసీహెచ్‌కే వస్తున్నారు. సాధారణ ప్రసవాలు ఎక్కువగా అవుతుండడంతో మంచిర్యాల ఎంసీహెచ్‌కు జిల్లాతోపాటు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా, మహారాష్ట్ర నుంచి గర్భిణులు ప్రసవం కోసం వస్తున్నారు. దీంతో ఈ ఏడాది జూన్‌లో 319 మంది, జూలైలో 383 మంది, ఆగస్టులో 28వ తేదీ వరకు 350 మందికి ప్రసవం చేశారు. అయితే ఎంసీహెచ్‌ను గోదావరి ఒడ్డున కాకుండా ఐబీలోని విశ్రాంతి భవనం ఉన్న స్థలంలో నిర్మించి ఉంటే, జీజీహెచ్‌కు ఎదురుగా ఉండి, ప్రజలకు మరిన్ని సేవలను అందించేందుకు అవకాశం ఉండేది. ఏటా ప్రసవాలు పెరుగుతున్నా, ప్రజాప్రతినిధులు, అధికారులు సేవలను ప్రజలకు మరింత మెరుగ్గా అందించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

జీజీహెచ్‌లో 200 పడకలే..

ఇక జీజీహెచ్‌లో 200 పడకల వరకే వైద్య సేవలు అందించే వీలుంది. ఎంసీహెచ్ నుంచి 150 మంది రావడంతో వార్డుల్లో పడకలను సర్దుబాటు చేయడం ఇబ్బందిగా మారుతోంది. ఇతరత్ర వైద్య సేవలకే వార్డులు, గదులు సరిపోక ఇబ్బందులతో, ఎంసీహెచ్ నుంచి వచ్చిన బాలింతలు, గర్భిణులకు వార్డులను కేటాయించడం కష్టంగా మారింది. బాలింతలను వార్డుల్లోకి పంపించి, వార్డుల్లోని ఇతరత్ర వ్యాధులతో చికిత్స పొందుతున్న వారిని వరండాల్లో బెడ్లు వేసి చికిత్సను అందిస్తున్నారు. 200 బెడ్‌ల ఆసుపత్రిలో 400 పడకలు సర్దుబాటు చేసి వైద్యం అందిస్తున్నారు.

ఏటా ఇదే తంతు...

మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కేంద్రంలోని గోదావరి ఒడ్డున నిర్మించడంతో ఏటా వరద ముప్పు పొంచి ఉంది. గోదావరి నదిపై నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరి గేట్లు ఎత్తితే వరదకు ఎంసీహెచ్ మునిగిపోతుంది. గతేడాది మార్చిలో ఎంసీహెచ్‌ను ప్రారంభించి, మే నెలలో పూర్తిస్థాయి వైద్య సేవలను ప్రారంభించారు. అదే ఏడాది జూలైలో కురిసిన భారీ వర్షాలకు 13వ తేదీన ఎంసీహెచ్ భవనం మొదటి అంతస్తు పూర్తిగా వరద నీటిలో మునిగి పోగా, ముందు రోజు రాత్రే గర్భిణులు, బాలింతలను జీజీహెచ్‌కు తరలించడంతో ప్రాణహాని తప్పింది. అయితే ఆసుపత్రిలోని మందులు, వైద్య పరికరాలు, బెడ్‌లు, ఇతరత్ర సామగ్రి, కేసీఆర్ కిట్లు పూర్తిగా నీటమునిగాయి. కోట్ల రూపాయల నష్టం జరిగింది. ఈ ఏడాది జనవరిలో మరోసారి ఎంసీహెచ్‌ను పునఃప్రారంభించారు. జూలై వరకు ప్రసూతి వైద్య సేవలు నిరాటకంగా కొనసాగాయి. గతనెల 21న భారీ వర్షాలకు వరదలు రావడంతో వైద్యాధికారులు మళ్లీ గర్భిణులు, బాలింతలను జీజీహెచ్‌కు తరలించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న మందులు, సామగ్రిని మొదటి అంతస్తులోకి మార్చారు.

వచ్చే నెలలో తరలిస్తాం



గోదావరి ఒడ్డున ఉన్న ఎంసీహెచ్‌కు గత నెలలో వరదలు రావడంతో, జీజీహెచ్‌కు తరలించాం. వర్షాకాలం పూర్తయితేనే తిరిగి ఎంసీహెచ్‌లోకి గర్భిణులు, బాలింతలను తరలిస్తాం. జీజీహెచ్‌లో ఇతర రోగులకు వైద్యం అందించేందుకు సరిపడా బెడ్లు లేవు. గర్భిణులు, బాలింతలను జీజీహెచ్‌కు తరలించడం వల్ల ఇతర వ్యాధులతో చికిత్సను పొందుతున్న వారికి వరండాలో బెడ్లు వేశాం. వచ్చే నెలలో గర్భిణులు, బాలింతలను ఎంసీహెచ్‌కు తరలిస్తాం.

– డాక్టర్ హరిశ్చందర్‌రెడ్డి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా

మహిళా ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త

ఆదిలాబాద్: రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు లక్కీ డ్రా ద్వారా ప్రత్యేక బహుమతులను అందజేయనున్నట్లు ఆదిలాబాద్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సోలోమన్ పేర్కొన్నారు. పండుగ నేపథ్యంలో 30, 31 తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలు లక్కీ డ్రాలో పాల్గొనవచ్చని తెలిపారు. టికెట్ వెనకాల పేరు, ఫోన్ నెంబర్ రాసి రీజియన్ పరిధిలోని బస్టాండ్లలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌ల్లో వేయాలని, లక్కీ డ్రాలో పాల్గొని విలువైన బహుమతులు గెల్చుకోవాలని సూచించారు. సెప్టెంబర్ తొమ్మిదవ తేదీలోగా లక్కీ డ్రా నిర్వహిస్తామని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట బెటాలియన్ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న గోపతి అలంకార్(29) మంగళవారం మృతి చెందాడు. హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మంచిర్యాలకు చెందిన గోపలి అలంకార్, మడిశెట్టి హరీశ్‌లు మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఎలక్ట్రానిక్ షోరూంలో పనిచేస్తున్నారు. ఈ నెల 20వ తేదీన రాత్రి ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై లక్సెట్టిపేట వైపు వెళ్తుండగా గుడిపేట బెటాలియన్ సమీపంలో వీరి వాహనానికి ఎదురుగా గేదె వచ్చింది. దీంతో ఒక్కసారిగా బైక్ బ్రేక్ వేయడంతో వేగంగా ఉన్న వాహనం అదుపుతప్పి ఇరువురు కింద పడ్డారు. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న హరీశ్‌తో పాటు అలంకార్‌లకు తీవ్రగాయాలు కాగా గమనించిన స్థానికులు మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అలంకార్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి గోపలి మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ఆసిఫాబాద్‌రూరల్: ట్రాక్టర్, ఆటో ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆసిఫాబాద్‌లో రవిచంద్ర కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ఫెరోజ్ ఖాన్(28), బూర్గుడకు చెందిన మిత్రుడు హంజత్ (25)తో కలిసి ఆటోలో ఆసిఫాబాద్ నుంచి బాబాపూర్‌కు వెళ్లి వస్తుండగా అంకుసాపూర్ వద్ద ట్రాక్టర్ ఎదురుగా ఢీకొంది. గాయపడిన ఇద్దరిని స్థానికులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన హంజత్‌ను మంచిర్యాలకు రెఫర్ చేశారు.

బైక్ ఢీకొని వృద్ధురాలికి...

మండలంలోని చిర్రకుంట గ్రామానికి చెందిన కమలబాయి(65) ఇంట్లో నుంచి రోడ్డుపైకి వస్తుండగా బైక్ ఢీకొట్టింది. దీంతో కమలబాయికి గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఆటోలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



అనుబంధాల రాఖీ

రాఖీ పండుగంటేనే సోదరి, సోదరుడి మధ్యన ప్రేమానుబంధానికి ప్రతీక. హిందువుల పంచాంగం ప్రకారం ఈ ఏడాది అధిక మాసంతో రాఖీ పౌర్ణమితో సహా అనేక పండుగలు, ఉపవాస దీక్షలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ప్రతీ సంవత్సరం శ్రావణమాసంలో వచ్చే పౌర్ణమి తిథి నాడు రాఖీ పండుగను జరుపుకుంటారు. నేడు 30న బుధవారం శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమి తిథి ఉదయం 10:58 గంటలకు ప్రారంభమై మరుసటి రోజు ఉదయం 7:05కు ముగుస్తుంది. దీంతో ఈసారి రెండు రోజులు పండుగను జరుపుకోవచ్చని పండితులు చెబుతున్నారు. ఆడపడుచును మహాలక్ష్మి స్వరూపంగా, పరాశక్తికి ప్రతీకగా భావించే సంస్కృతి మనది. కష్ట సుఖాల్లో, సుఖ సంతోషాల్లో మేమున్నామనే భరోసాను అక్కాచెల్లెళ్లకు కల్పించడమే రాఖీ బంధం. రేపు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఘనంగా జరుపుకోనున్నారు.

– కెరమెరి(ఆసిఫాబాద్)/నిర్మల్‌ఖిల్లా



తమ్ముళ్లకు రాఖీ కడుతున్న సోదరి

- నేడు రేపు రాఖీ పండగ
- దేవతలు, రాజుల కాలం నుంచి వస్తున్న ఆచారం
- కిటకిటలాడుతున్న రాఖీ స్టాళ్లు

ప్రచారంలోని కొన్ని కథలు..

దేవతల కాలం నుంచి.. శ్రీరాముడికి కౌసల్య రాఖీ కట్టిందని, రాక్షసుడు విష్ణు భక్తుడైన బలికి మహాలక్ష్మి రాఖీ కట్టి మృత్యువు నుంచి కాపాడిందని, శకుంతల తన గారాల కొడుకు భరతునికి శత్రుభయం లేకుండా తాయిత్తు కట్టిందని కథలు ఉన్నాయి. దేవేంద్రుడు సకల రాక్షసుల మధ్య పన్నెండు సంవత్సరాలు మహాయుద్ధం జరిగింది. ఈ సందర్భంలో రాక్షస రాజు ముల్లోకాలను జయించాడు. పరిస్థితిని గుర్తించిన బృహస్పతి ఇంద్రుడికి విజయం కలుగాలని ఇంద్రాణితో ఇంద్రుడికి రక్ష కట్టించాడు. ఇది శ్రావణ పౌర్ణమి రోజున వేద పండితుల మంత్రోచ్చారణలో జరిగిందని పురాణాలు చెబుతున్నాయి.

సందడిగా మార్కెట్లు..

కాలానుగుణంగా రాఖీలు కొత్త కొత్త డిజైన్లలో వస్తున్నాయి. గతంతో పోల్చితే ఈసారి విక్రయాలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఆయా జిల్లా కేంద్రాల్లో భారీగా దుకాణాలు వెలిశాయి. వారం ముందు నుంచే అమ్మకాలు జోరందుకున్నాయి. గతంలోకంటే ఈసారి అనేక స్టాళ్లు వెలిశాయి. పండుగ సందర్భంగా మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. ప్రత్యేక రాఖీలు మార్కెట్‌లలో లభ్యమవుతున్నాయి.

రెండురోజుల పాటు పౌర్ణమి..

ఈ సంవత్సరం పౌర్ణమి ఆగస్టు 30 ఉదయం 10.59 గంటలకు ప్రారంభమై ఆగస్టు 31న ఉదయం 07:06 గంటలకు ముగుస్తుంది. పండగను ఆగస్టు 30, 31 రెండు రోజులు జరుపుకోవచ్చని పండితులు అంటున్నారు.

అన్నాచెల్లెల ఆత్మీయతకు ప్రతీక..

ప్రతీ ఏటా శ్రావణ పౌర్ణమి రోజు రక్షాబంధన్ (రాఖీ)ను అన్నాచెల్లెలు ఘనంగా నిర్వహించుకుంటున్నారు. దుష్టశక్తులను పారదోలడానికి యుద్ధంలో విజయం సాధించడానికి రక్షా బంధన్ ధరించాలని శ్రీకృష్ణుడు చెప్పినట్లు పురాణాలు తెలుపుతున్నాయి. ఏదైనా కార్యక్రమం నిర్వహించ తలపెట్టినప్పుడు రక్ష ధరించడం హైందవ ఆచారం. ఆ కార్యక్రమం ఏ విఘ్నాలు లేకుండా సజావుగా సాగాలని, అనుక్షణం లక్ష్యం గురించి గుర్తు చేసేందుకు ఈ రక్ష బంధనాన్ని ధరిస్తారు.

అన్న కోసం రాఖీ కొన్నా...



మాది సారంగాపూర్ మండలంలోని ఆలూరు గ్రామం. రాఖీలు, స్వీట్లు కొనడానికి నిర్మల్ వచ్చాను. ప్రతీ సంవత్సరం మా అన్నకు రాఖీ కడతాను. ఆదిలాబాద్ జిల్లా నుంచి నా దగ్గరికి వచ్చి మా అన్నయ్య రాఖీ కట్టించుకొని వెళ్తాడు. ఎంత వయసు వచ్చినా అన్నాచెల్లెల అనుబంధానికి ఏదీ సాటిరాదు.

– పోసాని, కొనుగోలుదారు, ఆలూర్, నిర్మల్ జిల్లా



నిర్మల్‌లో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు





నిర్మల్‌లో రాఖీలను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

జిల్లా కేంద్రంలో దొంగల హల్‌చల్

- ఒక్కరోజే ఆరు షాపుల్లో చోరీ
- దొంగల కోసం పోలీసుల వేట



రైల్వేట్రాక్‌పై ఓ అనుమానితుడిని విచారిస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో దొంగలు హల్‌చల్ సృష్టించిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై జగదీష్ వివరాల ప్రకారం... స్థానిక ముఖరాం చౌరస్తాలోని సమీపంలోని ఐదు మెడికల్ షాపులు, ఒక కిరాణం షాపులో దొంగలు పడ్డారు. కాగా దోతుల రవికి చెందిన అభయ్ కిరాణం షాపులో జరిగిన దొంగతనంలో రూ.10వేలు నగదు, ఏటీఎం, క్రెడిట్ కార్డులు చోరీకి గురైనట్లు తెలిపారు. మిగత ఐదు మెడికల్ షాపుల్లో నగదు చోరీకి గురికాలేదు. మంగళవారం ఉదయం ఎప్పటిలాగే దుకాణాలను తెరిచేందుక వచ్చి చూడగా షెట్టర్లు పగలగొట్టి ఉండడంతో దొంగతనం జరిగినట్లు భావించిన మెడికల్ షాపు యజమాని రవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చిందరవందరగా పడేసిన సామగ్రి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్ పంప్ ప్రాంతంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ప్రైవేటు ఉద్యోగి అనిల్ కుమార్ నివాసంలో సోమవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. అనిల్‌కుమార్ ఇంటికి తాళం వేసి ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు తాళాలను పగలగొట్టి రెండు బీరువాల్లోని రూ.50వేల నగదు దోచుకెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కాగజ్‌నగర్ టౌన్ పోలీసులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి భరోసా



నగదు అందిస్తున్న పీవో పురుషోత్తంరెడ్డి

నస్పూర్: శ్రీరాంపూర్ ఓసీలో ఓబీ కాంట్రాక్ట్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు గాయపడి మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారం, ఇంట్లో ఇద్దరికి ఉద్యోగాలు ఇవ్వడానికి సీఆర్ఆర్ సంస్థ యాజమాన్యం అంగీకరించింది. శ్రీరాంపూర్ ఓసీ ఓబీలో సింగాపూర్‌కు చెందిన అట్కపురం రాజయ్య కాంట్రాక్ట్ కార్మికుడు మే 8న విధులకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో సాండ్ బంకర్ చెక్‌పోస్టు వద్ద గేటు తలకు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వరంగల్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. కార్మికుడి మృతికి సీఆర్ఆర్ సంస్థ యజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు బంధువులు, గ్రామస్తులు సోమవారం శ్రీరాంపూర్ ఓసీపై ఆందోళనకు దిగారు. దీంతో సోమవారం రాత్రి సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి, ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ పురుషోత్తం రెడ్డి, జైపూర్ ఏసీపీ మోహన్, అధికారుల సమక్షంలో కుటుంబ సభ్యులు, వివిధ పార్టీల, యూనియన్, కుల సంఘాల నాయకులతో సీఆర్ఆర్ సంస్థ యాజమాన్యం చర్చలు జరిపింది. మృతుడి కుటుంబానికి నష్టపరిహారంగా రూ.8లక్షలు, ఇంట్లో ఇద్దరికి ఉద్యోగం కల్పిస్తామని సీఆర్ఆర్ సంస్థ యాజమాన్యం హామీ ఇచ్చింది. దీంతో మృతుడి కుటుంబ సభ్యులకు సోమవారం రూ.లక్ష నగదును చెల్లించారు. మిగతా రూ.7లక్షలను సెప్టెంబర్ 10న చెల్లించడానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ చర్చల్లో సింగాపూర్ మాజీ సర్పంచ్ రాజేంద్ర పాణి, బీఎంఎస్ నాయకులు పేరం రమేశ్, మాజీ ఎంపీటీసీలు అగ్గు మల్లేశ్, గుమ్మడి శ్రీనివాస్, కొండపర్తి శంకర్, మాజీ వార్డు సభ్యులు బొడ్డు తిరుపతి, రుకుం తిరుమల్, నాయకులు జనార్దన్, అట్కపురం సతీష్, సమ్మయ్య, సంజీవ్, రమేశ్ పాల్గొన్నారు.

లాభాల వాటా చెల్లించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న నాయకులు, కార్మికులు

జైపూర్: సింగరేణి యాజమాన్యం 11వ వేజ్ బోర్డుకు సంబంధించిన 23 నెలల బకాయిలు, లాభాల వాటాను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గనిపై హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షులు తిప్పారపు సారయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కోల్ ఇండియా యాజమాన్యం ఆగస్టు వేతనాలతో కలిపి సెప్టెంబరులో మొత్తం బకాయిలు చెల్లించాలని ఆదేశించిన కానీ సింగరేణి యాజమాన్యం మౌనం వహిస్తూ కాలయాపన చేయడాన్ని వారు తీవ్రంగా వ్యతికేరిస్తున్నట్లుగా తెలిపారు. గత 2022–23 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థకు వచ్చిన రూ.2,22కోట్ల లాభాల్లో 700కోట్లు కార్మికుల వాటా చెల్లిస్తామని సంస్థ ప్రకటించినప్పటికీ ఎప్పుడు చెల్లిస్తారో యాజమాన్యం ఖచ్చితమైన తేదీని ప్రకటించకపోవడం వలన కార్మికులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని తెలిపారు. అదేవిధంగా ఏరియర్స్ చెల్లించడంలో జాప్యానికి నిరసనగా ఈ నెల 31 శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనుల, డిపార్టుమెంట్ల వద్ద నిరసన వ్యక్తం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ నాయకులు దుర్గం లక్ష్మణ్, మీస కొమురయ్య, వంశీ, సాయినిఖిల్, రంజిత్, వేణు, వెంకటేశ్, షఫి, నగేశ్ పాల్గొన్నారు.

11 నుంచి సాయుధ పోరాట వార్షికోత్సవాలు



మాట్లాడుతున్న చంద్రశేఖర్

బెల్లంపల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలు సెప్టెంబర్ 11 నుంచి 17వరకు నిర్వహించనున్నట్లు సీపీఐ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. వారం రోజులపాటు గ్రామగ్రామాన ఎర్ర జెండాలను ఎగురవేసి కమ్యూనిస్టు అమరులకు విప్లవ జోహార్లు సర్పించాలని శ్రేణులకు పిలుపు ఇచ్చారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో సీపీఐ నిర్వహించిన పాత్ర అనిర్వచనీయమని పేర్కొన్నారు. 17వ తేదీన హైదరాబాద్‌లో జరిగే బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎం.వెంకటస్వామి మాట్లాడుతూ... ప్రజల కోసం ప్రాణత్యాగాలు చేసిన వీర చరిత్ర సీపీఐకి ఉందన్నారు. కమ్యూనిస్టు ఉద్దండులు రావి నారాయణ రెడ్డి , సర్వదేవ భట్ల రామనాథం, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూంమోహినోద్దిన్ తదితర ఎందరో నాయకులు సాయుధ పోరాటంలో కీలకంగా వ్యవహరించారని అన్నారు. మతోన్మాత పార్టీ బీజేపీతో జత కట్టిన బీఆర్ఎస్‌ను వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, సహాయ కార్యదర్శి బియ్యాల ఉపేందర్, జిల్లా సమితి సభ్యులు జీసీ మాణిక్యం, అక్కెపల్లి బాపు, బెల్లంపల్లి మండల సీపీఐ కార్యదర్శి బి.లక్ష్మి నారాయణ, నాయకులు రత్నం రాజం, ఎల్తూరి శంకర్, బి.రాంచందర్, స్వామిదాస్ పాల్గొన్నారు.

అక్క జీవితం నాశనం చేసినందుకే హత్య

- ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి రాంచందర్ హత్యకేసులో నిందితుల అరెస్ట్



సమావేశంలో మాట్లాడుతున్న సెంట్రల్ జోన్ డీసీపీ బారీ

ఖిలా వరంగల్: రెండో పెళ్లి చేసుకుని అక్క జీవితం నాశనం చేసిన బావ, అతడి తండ్రిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. సమయానికి బావ ఇంట్లో లేకపోవడం.. అతడి తండ్రి ఉండడంతో హత్య చేసి తన కక్షను తీర్చుకున్నాడు. ఈ నెల 23న వరంగల్ నగరంలోని కరీమాబాద్ ఎస్ఆర్ఆర్‌తోటలో జరిగిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి నాముతాబాజీ రాంచందర్ హత్య కేసులో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో రిమాండ్ చేశారు. కేసు వివరాలను మంగళవారం పోలీస్ కమిషనరేట్‌లో సెంట్రల్ జోన్ డీసీపీ బారీ వెల్లడించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన సాటేపూర్ అనిల్ సోదరి అరుణకు 20ఏళ్ల క్రితం వరంగల్‌లోని కరీమాబాద్‌లోని ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన నాముతాబాజీ రాంచందర్ కొడుకు త్రిలోక్ చందర్‌తో వివాహమైంది. కొంతకాలం తర్వాత అనారోగ్య కారణాలు చూపి అరుణను త్రిలోక్ వదిలేశాడు. దీనిపై అతడి తండ్రి రాంచందర్‌ను పిలిపించి పంచాయితీ పెట్టగా త్రిలోక్ చందర్‌కు చెడుఅలవాట్లు ఉన్నాయని.. విడాకుల పత్రం రాయించారు. ఆ సమయంలో ఒప్పుకున్న డబ్బుల్లో కొన్ని మాత్రమే ఇచ్చి మిగతావి ఇవ్వకుండా మోసం చేశారు. అప్పటినుంచి అరుణ తమ్ముడు అనిల్‌తోనే ఉంటోంది. అరుణ శుభకార్యాలకు వెళ్లకపోవడం.. ఇరుగుపొరుగువారు సూటిపోటి మాటలతో ఆమెను చులనగా చూడడం, త్రిలోక్ చందర్ మాత్రం మొదట తిరిగిన అమ్మాయినే రెండో వివాహం చేసుకుని సంతోషంగా ఉంటున్నాడు. సోదరి అరుణ జీవితం నాశనం కావడానికి కారణమైన త్రిలోక్ చందర్, అతడి తండ్రి రాంచందర్‌ను చంపాలని అనిల్ నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో అతడి మేనమామ హన్మకొండలో ఉంటున్నాడు. ఈ నెల 21న అనిల్ హన్మకొండలోని మేనమామ ఇంటికి చేరుకుని స్నేహితుడు అయిన కరీంనగర్ జిల్లా వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన నారాయణ దాస్ అరుణ్‌కుమార్‌ను కలిశాడు. ఇద్దరు కలిసి 22న త్రిలోక్ చందర్ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారు. 23న ఉదయం 8గంటలకు సమయంలో ఇద్దరు కలిసి బైక్‌పై కరీమాబాద్ ఏరియాకు చేరుకున్నారు. అక్కడ ఓ దుకాణంలో కత్తి కొనుగోలు చేసి.. మెడికల్‌షాపులో చేతి గ్లౌసులు తీసుకున్నారు. ఆ తరువాత రాంచందర్ ఇంటి వద్దకు చేరుకుని అరుణ్ బైక్ స్టార్ట్ చేసి రెడీగా ఉండాలని చెప్పి అనిల్ ఇంట్లోకి వెళ్లాడు. ఆ సమయంలో త్రిలోక్ ఇంట్లో లేకపోవడం.. రాంచందర్ (65) ఒక్కరే ఉండడంతో అతడి గొంతు కోసి వచ్చాడు. ఆ తరువాత బైక్‌పై కాగజ్‌నగర్‌కు వెళ్లిపోయారు. పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించి గాలింపు చర్యలు మొదలుపెట్టారు. విషయం తెలుసుకున్న అనిల్, అరుణ్‌కుమార్‌లు డబ్బులు తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లిపోదామని మంగళవారం కాగజ్‌నగర్ నుంచి హన్మకొండలోని మేనమామ ఇంటికి చేరుకున్నారు. అక్కడేమాటు వేసిన పోలీసులు వారిని పట్టుకున్నారు. వారినుంచి కత్తి, రెండు గ్లౌస్‌లు, హీరో హోండా బైక్, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ నరేష్ కుమార్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు పి.దేవేందర్, రాంబాబు, ఏఎస్ సల్మాన్‌పాషా పాల్గొన్నారు.

పురుగుల మందుతాగి వివాహిత ఆత్మహత్య

నర్సాపూర్(జి): పురుగుల మందుతాగి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని బామిని(బి) గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... నార్వాడే ప్రతిభ (27) ఏడాదిగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆరు నెలల క్రితం రొమ్ము ఆపరేషన్ జరిగింది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందుతాగి అపస్మారకస్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం భైంసా ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆస్పత్రి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. భర్త గణేష్ వ్యవసాయం చేస్తుండగా వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ పేర్కొన్నారు.

సామాజిక సేవ అభినందనీయం



లోగో ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీ ప్రాంతాల ఆదివాసీ గిరిజన పిల్లలకు కెరియర్ గైడెన్స్ కార్యక్రమాలు చేపట్టడానికి గిరిజన ఉద్యోగులు సామాజిక కార్యక్రమాలు చేపట్టడం హర్షనీయమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో మై డ్రీమ్స్ కం ట్రూ లోగోను ఆవిష్కరించారు. గిరిజన పిల్లల్లో సామాజిక చైతన్యం కోసం ప్రభుత్వ ఉద్యోగులు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు కుమ్ర సాయి కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఆడ నగేశ్, ఉపాధ్యక్షులు జాదవ్ దివ్య, సంయుక్త కార్యదర్శి దేవేందర్, కోశాధికారి వినయ్‌కుమార్, రజినీకాం, మెస్రం నాగేశ్వర్, మాదాసు మధుకర్ పాల్గొన్నారు.

వ్యాపారం సాగక.. అప్పులు కట్టలేక

- ఉరేసుకుని వ్యాపారి ఆత్మహత్య



సంతోష్(ఫైల్)

వాంకిడి: సొంత వ్యాపారం పెట్టి ఎదుగుదామనుకున్న ఓ యువకుడు నష్టాలతో బ్యాంకు రుణాలు, ఫైనాన్స్ కిస్తీలు కట్టలేక, తీసుకున్న అప్పులు భారంగా మారడంతో మనస్తాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం మండలంలోని బంబార గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. వాంకిడి మండలంలోని బంబార గ్రామానికి చెందిన అకారపువార్ సంతోష్(38)కు 2007లో వివాహం జరగగా ఇద్దరు కుమారులు ఉన్నారు. 2014లో కరీంనగర్ వెళ్లి అక్కడి ఓ పౌల్ట్రీ ఫామ్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తూ ఉండేవాడు. కొంత కాలం తర్వాత సొంతంగా ఏదైన వ్యాపారం చేసి పుట్టిన గ్రామంలోనే స్థిర పడాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే అక్కడి యాక్సిస్ బ్యాంకులో రూ.5 లక్షలు పర్సనల్ లోన్ తీసుకున్నాడు. అలాగే చిట్టీల రూపంలో రూ. లక్ష అప్పుగా తీసుకుని బట్టల వ్యాపారం చేయాలనుకున్నాడు.. 2019– 20లో కరోనా కారణంగా కరీంనగర్ నుంటి సొంత గ్రామానికి వచ్చిన సంతోష్ అనంతరం ఓ ఫైనాన్స్ కంపెనీ ద్వారా రూ.4లక్షలు ఫైనాన్స్ చేసి ఆటో ట్రాలీ తీసుకున్నాడు. ట్రాలీలో బట్టలు వేసుకుని వ్యాపారం ప్రారంభించాడు. కానీ వ్యాపారం సరిగ్గా నడవక నష్టాల బాటపట్టాడు. దీంతో బ్యాంకు, ఫైనాన్స్ వాయిదా కిస్తీలు భారంగా మారాయి. కొన్ని రోజులుగా దిగులుగా ఉన్న సంతోష్..ప్రతీ రోజు లాగే మంగళవారం ఉదయానే 4.30 సమయంలో వాకింగ్ వెళ్లొస్తానని బయటికి వెళ్లాడు. ప్రతీ రోజు తిరిగి వచ్చే సమయం దాటడంతో భార్య సరిత ఫోన్ చేసినా స్పందించలేదు. కొంతసేపటికి 8.30 సమయంలో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఫోన్ చేసి గ్రామ శివారులోని సేగ్రిగేషన్ షెడ్డులో సంతోష్ ఉరేసుకున్నాడని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. తండ్రి చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.